పెన్షనర్లను విభజించే చట్టాన్ని రద్దు చేయాలి

- కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో నష్టపోయే ప్రమాదం
- ఆలిండియా స్టేట్ పెన్షనర్ల ఫెడరేషన్ సెక్రటరీ జనరల్ సుధాకర్
- 15 తర్వాత కార్యాచరణ : మారం జగదీశ్వర్
- పిఎఫ్ఆర్‌డిఎ చట్టాన్ని రద్దు చేయాలి : మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి
- మహాధర్నాకు భారీగా తరలొచ్చిన పెన్షనర్లు

మహాధర్నాలో మాట్లాడుతున్న నర్సిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెన్షనర్లను పాత, కొత్త అంటూ విభజించే చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని ఆలిండియా స్టేట్ పెన్షనర్ల ఫెడరేషన్ సెక్రటరీ జనరల్ డి సుధాకర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2026 జనవరి ఒకటి ముందు, తర్వాత రిటైరైన పెన్షనర్లు అంటూ రెండు గ్రూపులుగా విభజించడం సరైంది కాదన్నారు. పెన్షనర్ల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో మహాధర్నాను చేపట్టారు. ఈ ధర్నాకు వివిధ జిల్లాల నుంచి వేలాది మంది పెన్షనర్లు తరలొచ్చారు. పెన్షనర్లు భారీగా రావడంతో ధర్నాచౌక్ ప్రాంతమంతా కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. పార్లమెంటులో ఫైనాన్స్ బిల్లుతోపాటు పెన్షనర్లకు సంబంధించిన రూల్స్‌ను 1972 నుంచి మార్పు చేయడం వల్ల తీవ్ర నష్టం జరుగుతుందని చెప్పారు. కేంద్రం చేసిన చట్టాలనే రాష్ట్రాలు కూడా అనుసరించే అవకాశముంటుందని అన్నారు. కేంద్రం చేసే నిర్ణయాలు, చట్టాలు పెన్షనర్లందరికీ మెడ మీద కత్తి వేలాడినట్టుగా ఉంటుందన్నారు. ఉద్యోగులు, పెన్షనర్లకు కాంగ్రెస్ ఎన్నో వాగ్దానాలు, ఆశలు చూపి అధికారంలోకి వచ్చిందని చెప్పారు. గద్దెనెక్కిన తర్వాత వారి సమస్యల పట్ల నిర్లక్ష్య ధోరణితో ఉండడం సరైంది కాదన్నారు. పెన్షనర్ల నాయకులను చర్చలకు పిలిచి సమస్యలపై చర్చించి పరిష్కారానికి పూనుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు.

లక్ష మందితో ఎల్‌బి స్టేడియంలో సభ : మారం జగదీశ్వర్

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి ఈనెల 15 వరకు డెడ్‌లైన్ విధించామని ఉద్యోగ జెఎసి చైర్మన్ మారం జగదీశ్వర్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) రామకృష్ణారావుకు నోటీసు ఇచ్చామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఇప్పటికే 21 నెలలు అవుతున్నదనీ, సమస్యల పరిష్కారం కోసం ఇంకెన్ని రోజులు ఆగాలని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 18 లేదా 20న ఉద్యోగ జెఎసి సమావేశాన్ని నిర్వహించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని చెప్పారు. లక్ష మంది ఉద్యోగులతో ఎల్‌బి స్టేడియంలో సభను నిర్వహిస్తామన్నారు. ఇహెచ్ఎస్‌ను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎస్‌ను రద్దు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఉద్యోగ జెఎసి సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ... ఉద్యోగుల సమస్యలపై నిర్లక్ష్యం వహించిన గత ప్రభుత్వానికి తడాఖా చూపించామనీ, అందుకే ప్రతిపక్షంలో ఉందన్నారు. నెలాఖరులోపు ఇహెచ్ఎస్ అమలుపై నిర్ణయం తీసుకోవాలని సూచించారు. వివిధ రకాల పెండింగ్ బిల్లులు రూ.13 వేల కోట్లున్నాయనీ, వాటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పిఆర్సీని 2023, జులై ఒకటి నుంచి అమలు చేయాలన్నారు. ప్రజాప్రతినిధులు, ఐఎఎస్ అధికారుల బిల్లులు పెండింగ్‌లో లేవని వివరించారు. కేవలం ఉద్యోగులు, పెన్షనర్ల బిల్లులే పెండింగ్‌లో ఉండడం సరైంది కాదన్నారు. ఐక్యంగా పోరాడితేనే సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు.

ఈ-కుబేర్‌లో పెండింగ్ బిల్లులు చెల్లించాలి : నర్సిరెడ్డి

ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల బిల్లులను వెంటనే చెల్లించాలని మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. ఇహెచ్ఎస్‌ను తాత్సారం చేయకుండా అమలు చేయాలని కోరారు. 2024 మార్చి నుంచి రిటైరైన ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించడం లేదన్నారు. హైదరాబాద్‌లో పెన్షనర్ల భవన్‌ను నిర్మించాలని అన్నారు. పిఎఫ్ఆర్‌డిఎ చట్టాన్ని రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెన్షనర్లను చర్చలకు పిలిచి వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ఎస్‌టియుటిఎస్ ప్రధాన కార్యదర్శి జి సదానందంగౌడ్ మాట్లాడుతూ... పెండింగ్‌లో ఐదు డిఎలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రూ.398 టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇచ్చి రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఎస్‌టిఎఫ్ఐ సీనియర్ నాయకులు ఎం సంయుక్త మాట్లాడుతూ... ప్రభుత్వాలు హామీలు ఇవ్వడమే కాకుండా ఆచరణలో వాటిని అమలు చేయాలని చెప్పారు. సమస్యలు పరిష్కారం కావాలంటే ఐక్య పోరాటాలను నిర్మించాలన్నారు. అధ్యక్షవర్గంగా వ్యవహరించిన పాలకుర్తి కృష్ణమూర్తి, కె లక్ష్మయ్య మాట్లాడుతూ... మంత్రులు, అధికారులను కలిసినా సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కండ్లు తెరిచి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో పెన్షనర్ల తడాఖా చూపిస్తామని హెచ్చరించారు. అవసరమైతే ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని పెన్షనర్ల నాయకులు ఉమాదేవి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ అధ్యక్షులు సునిల్, పెన్షనర్ల సమన్వయ కమిటీ నాయకులు ఎ శ్రీనివాసరావు, బి సత్యనారాయణ, నర్సయ్యగౌడ్, టిపిటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అనిల్‌కుమార్, తిరుపతి, టిఎన్‌జిఒ నాయకులు కస్తూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్ బాబు

రైతులను బలోపేతం చేసే దిశగా చర్యలు

- పిఎసిఎస్ ద్వారా 4 మెగావాట్ల సోలార్ విద్యుదుత్పత్తి : మంత్రి శ్రీధర్ బాబు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రైతులను బలోపేతం చేసేందుకు సంక్షేమ కార్యక్రమాలతో పాటు అనుబంధ రంగాల అభివృద్ధికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం పెద్దపల్లి జిల్లా మంథని మండలం చిల్లపల్లి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ. ఏడు కోట్లతో ఐదు ఎకరాల స్థలంలో నిర్మిస్తున్న రెండు గోదాములకు, గుంజపడుగు గ్రామంలో రూ. 2.90 కోట్లతో పిఎం కుసుమ్ ద్వారా పిఎసిఎస్ ఏర్పాటు చేయనున్న సోలార్ పవర్ ప్లాంట్‌కు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, కరీంనగర్ డిసిసిబి చైర్మన్ రవీందర్ రావుతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ గ్రీన్ ఎనర్జీ పాలసీలో భాగంగా పెద్దపల్లి జిల్లాలోని నంది మేడారం, కాల్వ శ్రీరాంపూర్, అప్పన్నపేట, మంథని ప్రాంతాల్లో ఒక్కో మెగావాట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నాలుగు నెలల్లో ఈ ప్లాంట్‌ల నిర్మాణం, గ్రిడ్ కనెక్షన్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. గుంజపడుగు ప్రాంతంలో సహకార బ్యాంక్ ఏర్పాటుకు ఆర్‌బీఐకి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో గ్రంథాలయ సంస్థ చైర్మెన్ నన్నయ గౌడ్, మంథని మార్కెటింగ్ కమిటీ చైర్మెన్ కుడుదుల వెంకన్న, ఆర్డీఓ సురేష్, సహకార సంఘం అధ్యక్షులు కొత్త శ్రీనివాస్, తహసీల్దార్ కుమార స్వామి, ఎంపిడిఓ శశికళ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న అరుణ్ తివారి

వ్యవసాయ శాస్త్రవేత్తలు దేశానికి సంపద

- డిఆర్‌డిఒ మాజీ డైరెక్టర్, మిస్సైల్ సైంటిస్ట్ అరుణ్ తివారి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వ్యవసాయ శాస్త్రవేత్తలు దేశానికి గొప్ప సంపదని డిఆర్‌డిఒ మాజీ డైరెక్టర్, మిస్సైల్ సైంటిస్ట్ అరుణ్ తివారీ అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఆకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రిసెర్చ్ మేనేజ్‌మెంట్ (నారం)లో జరిగిన 115వ ఫౌండేషన్ కోర్సు ఫర్ అగ్రికల్చరల్ రీసెర్చ్ సర్వీస్ ప్రారంభోత్సవానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రపంచంలోనే అతిపెద్ద వ్యవసాయ పరిశోధన సంస్థల్లో ఒకటిగా ఐసిఎఆర్ నిలిచిందన్నారు. ప్రపంచ స్థాయిని హైలెట్ చేస్తూ శిక్షణలో పాల్గొనేవారు తమ వృత్తిపరమైన ప్రయాణంలో ఆవిష్కరణ, పట్టుదలను స్వీకరించాలని సూచించారు. కష్టపడి పనిచేయాలని, విస్తృత దృక్పథాన్ని అవలంబించాలని అన్నారు. ఉత్సాహం, దృఢ సంకల్పంతో వారి కెరీర్‌లో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాలని తెలిపారు. రైతులకు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే వివిధ రకాల నూతన ఆవిష్కరణల గురించి నిత్యం పరిశోధనలు చేయాలని అన్నారు. కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్ సభ్యులు డాక్టర్ చబిలేంద్ర రౌల్ మాట్లాడుతూ.. 1960ల్లో ఆహార కొరత నుంచి స్వయం సమృద్ధి, ఆహార భద్రత సాధించే వరకు భారతదేశ ప్రయాణాన్ని వివరించారు. పోషకాహార భద్రత, వాతావరణ మార్పు ప్రభావాలను పరిష్కరించేటప్పుడు నాణ్యత, మెరుగుదల, సహజ వనరులను పరిరక్షించడం, యాంత్రీకరణ, సామాజిక-ఆర్థిక చిక్కులను అర్థం చేసుకోవడం వైపు దృష్టి సారించాల్సిన అవసరాన్ని వివరించారు. రైతులకు, సమాజానికి ప్రత్యక్ష ప్రయోజనాలను అందించే ప్రాథమిక, అనువర్తిత పరిశోధనలను కొనసాగించాలని ప్రొబేషనరీ శాస్త్రవేత్తలను కోరారు. ఈ కార్యక్రమంలో ఐసిఎఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జోయ్, నారం డైరెక్టర్ డాక్టర్ గోపాల్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ గొంతుకను జైళ్లు నిర్బంధించలేవు

- సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజాస్వామ్యం కోసం పోరాటం ప్రారంభించి, ప్రతి భారతీయుని ఓటుకున్న పవిత్ర శక్తి పునరుద్ధరణ కోసం నిలబడ్డ రాహుల్ గాంధీ గొంతుకను జైళ్ల నిర్బంధించలేవని ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు ఇతర కాంగ్రెస్ నాయకులను నిర్బంధించే దారుణమైన చర్యకు బిజెపి పాల్పడిందని ఆయన పేర్కొన్నారు. నిర్బంధంతో రాహుల్‌గాంధీకున్న దృఢ సంకల్పాన్ని ఆపలేరని హెచ్చరించారు.

హైదరాబాద్‌లో జెడ్ఎస్ జిసిసి సెంటర్ ఏర్పాటు

హైదరాబాద్ : గ్లోబల్ మేనేజ్‌మెంట్ కన్సల్టింగ్ సంస్థ జెడ్ఎస్ హైదరాబాద్‌లో 50,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో 550-600 మందికి వసతి కల్పించే కొత్త కార్యాలయాన్ని ప్రారంభించినట్లు వెల్లడించింది. ఆరోగ్య సంరక్షణ, లైఫ్ సైన్సెస్ జిసిసిల కోసం ఆవిష్కరణ, సాంకేతిక సేవలను బలోపేతం చేసేందుకు ఈ కొత్త సెంటర్ మద్దతును ఇవ్వనుందని జెడ్ఎస్ ప్రాంతీయ మేనేజింగ్ అధికారి మోహిత్ సూద్ తెలిపారు. జిసిసిలు ఆవిష్కరణ కేంద్రాలుగా మారుతున్నాయన్నారు. జెడ్ఎస్ ఈ మార్పునకు మద్దతును అందిస్తుందన్నారు.

అక్షయపాత్రకు ఇవ్వొద్దంటే అరెస్టులేంటి?

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరంగల్, ఖిల్లా వరంగల్ మండలాల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్రకు ఇచ్చి ప్రయివేటు చేయడాన్ని వ్యతిరేకిస్తూ మంత్రి కొండా సురేఖ ఇంటివద్ద ఆందోళన చేసిన మధ్యాహ్న భోజన పథకం కార్మికులను, సిఐటియు నాయకులను అరెస్టు చేయడమేంటి? అని సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ ప్రశ్నించారు. అక్రమ అరెస్టులను ఖండించారు. ఓ ప్రయివేటు సంస్థకు ఇచ్చి మధ్యాహ్న భోజన కార్మికుల పొట్టగొట్టొద్దని సూచించారు. ఈ మేరకు సోమవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. "సిఐటియు నాయకులతో పాటు మధ్యాహ్న భోజన కార్మికుల పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. హనుమకొండ సుబేదారి పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించారు. ఈ పద్ధతిని సర్కారు మానుకోవాలి. అక్రమంగా అరెస్ట్ చేసిన సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి, జిల్లా కార్యదర్శి ఆదూరి కుమార్, వాణి, ప్రభాకర్, ఉపేందర్‌ను తక్షణమే విడుదల చేయాలి.

23 ప్రాధాన్యత అంశాలను గుర్తించాం

- సిఎస్ కృష్ణారావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో 23 ప్రాధాన్యతా అంశాలను గుర్తించి అందులో 12 అమలు చేస్తున్నామనీ, మరో 10 అంశాలు అమలు చేయబోతున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు తెలిపారు. మరో అంశం అమలు చేయబోవడం లేదని తెలిపారు. సోమవారం కేంద్ర క్యాబినెట్ సెక్రటరీ టి.వి.సోమనాథన్ అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఆయా అంశాల అమలుపై సమీక్షించారు. జన్ విశ్వాస్ బిల్లుకు సంబంధించి సీఎస్ మాట్లాడుతూ... అందులో క్రిమినల్ ప్రొవిజన్స్‌కు గుర్తించిన వాటిని ఆయా విభాగాలకు పంపించినట్టు తెలిపారు. ఆయా శాఖల వారిగా స్టేట్ జన్ విశ్వాస్ బిల్లు ముసాయిదాపై అవసరమైన సూచనలు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. నిర్దేశిత సమయంలోపు ప్రాధాన్యతా అంశాలను అమలు చేయాలని ఆయన ఆయా శాఖల ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్‌లో తెలంగాణ రోడ్లు, భవనాలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, పరిశ్రమలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, కార్మికశాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్, ఫైర్ సర్వీసెస్ అడిషనల్ డీజీ నాగిరెడ్డి, పర్యావరణం,, అటవీ, శాస్త్ర, సాంకేతికశాఖ ముఖ్యకార్యదర్శి అహ్మద్ నదీం పాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి దామోదర

నులిపురుగుల నిర్మూలనకు మాత్రలు వాడాలి

- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నులిపురుగుల నిర్మూలనకై చిన్నారులకు మాత్రలు వేయాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. రంగారెడ్డి జిల్లా మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని షేక్‌పేట సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి హాజరై ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. విద్యార్థులకు నులిపురుగుల నిర్మూలన మాత్రల ప్రయోజనాలను వివరించారు. ఎన్‌డిడిలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 1-19 సంవత్సరాల వయసున్న పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని అంగన్‌వాడీ సెంటర్లు, ప్రభుత్వ, ప్రయివేట్ స్కూళ్లు, కాలేజీల్లో మాత్రల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. సుమారు 98 లక్షల మంది చిన్నారులకు మాత్రలు పంపిణీ చేయాలని టార్గెట్‌గా పెట్టుకున్నామని అన్నారు. చిన్నారుల పేగుల్లో ఉండే నులిపురుగులను నివారించి, రక్తహీనతను అధిగమించేందుకు, రోగనిరోధక శక్తి పెంపొందించేందుకు ఈ మాత్రలు ఉపయోగపడతాయని చెప్పారు. 1-19 సంవత్సరాల వయసున్న పిల్లలందరూ నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకునేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ ఎస్.సంగీత సత్యనారాయణ, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, డీహెచ్ఓ అధికారులు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బాలస్వామి, విద్యార్థులు, పాల్గొన్నారు.

రిజిస్టర్డ్ గుర్తింపు లేని 13 పార్టీలను జాబితా నుంచి తొలగింపు

- సర్క్యులర్ జారీ చేసిన తెలంగాణ ఎన్నికల సంఘం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశం మేరకు రాష్ట్రంలోని 13 రిజిస్టర్డ్ గుర్తింపు లేని రాజకీయ పార్టీల (ఆర్‌పిపియు)ను జాబితా నుంచి తెలంగాణ ఎన్నికల సంఘం (టిఇసి) తొలిగించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సి సుదర్శన్ రెడ్డి సోమవారం సర్క్యులర్ జారీ చేశారు. తొలగించిన పార్టీల జాబితా ప్రకారం.. తెలంగాణ మైనార్టీస్ ఒబిసి రాజ్యం, బహుజన్ సమాజ్ పార్టీ (అంబేద్కర్-పూలే), ఇండియన్ మైనారిటీ పొలిటికల్ పార్టీ, జాగో పార్టీ, జాతీయ మహిళా పార్టీ, నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్, తెలంగాణ కార్మిక రైతు రాజ్యం పార్టీ, తెలంగాణ లోక్‌సత్తా పార్టీ, తెలంగాణ ప్రజా సమితి (కిషోర్ రావు, కిషన్), తెలంగాణ స్టూడెంట్స్ యునైటెడ్ ఫర్ నేషన్, యువ పార్టీ, యువ తెలంగాణ పార్టీలు ఉన్నాయి. హైదరాబాద్, జిహెచ్ఎంసితో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎన్నికల ప్రధానాధికారులు (డిఇఒ) తగిన చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. రాజకీయ పార్టీలు (జాతీయ/రాష్ట్ర/నమోదైన కానీ గుర్తింపు లేని పార్టీలు) 1951 ప్రజాప్రతినిధుల చట్టం, సెక్షన్ 29 ప్రకారం భారత ఎన్నికల కమిషన్ వద్ద నమోదు అవుతాయి. చట్టంలోని నిబంధనల ప్రకారం ఒకసారి రాజకీయ పార్టీగా నమోదైన తర్వాత ఆరు సంవత్సరాలు నిరంతరం ఎన్నికల్లో పోటీ చేయని పక్షంలో, ఆ పార్టీని నమోదు చేయబడిన పార్టీల జాబితా నుండి తొలగిస్తారు. ఈ క్రమంలో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాష్ట్రం నుంచి 13 పార్టీలను తొలగించినట్టు తెలంగాణ ఎన్నికల సంఘం తెలిపింది.

శంకరన్, మాధవరావును ఆదర్శంగా తీసుకోవాలి

- తెలంగాణ గౌరవాన్ని దేశ స్థాయిలో నిలబెట్టాలి
- రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం చెక్కుల పంపిణీలో డిప్యూటీ సిఎం భట్టి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర గౌరవాన్ని దేశ స్థాయిలో నిలబెట్టేందుకు యువత కృషి చేయాలని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రానికి హ్యూమన్ రిసోర్స్ బలమైన పెట్టుబడి అని తెలిపారు. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో రాజీవ్ సివిల్స్ అభయహస్తం చెక్కుల పంపిణీ, సన్మాన కార్యక్రమాన్ని సోమవారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి భట్టి పాల్గొన్నారు. సివిల్స్ -2025 మెయిన్స్‌కు ఎంపికైన 178 మంది అభ్యర్థులకు రూ. లక్ష ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను భట్టి విక్రమార్క పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సివిల్స్ -2024 విజేతలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భట్టి మాట్లాడుతూ ఐఎఎస్ ఆఫీసర్ల సేవలు సమాజాభివృద్ధికి ఉపయోగపడాలని ఆకాంక్షించారు. సీనియర్ ఐఎఎస్ ఎస్ఆర్ శంకరన్, కాకి మాధవరావును ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. వారి సేవలను ప్రజలు ఇప్పటికీ గుర్తుంచుకుంటారని వివరించారు. రాష్ట్రం నుంచి అత్యధిక మంది మెయిన్స్‌లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. అందుకోసం ఏం చేయడానికైనా రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. నిబద్ధతతో పని చేసే వాళ్ళు చరిత్రలో నిలిచిపోతారని గుర్తు చేశారు. అధికారులు చిత్తశుద్ధితో పని చేస్తేనే ప్రభుత్వ లక్ష్యాలు నెరవేరుతాయని చెప్పారు. మానవీయ కోణంలో పేదల జీవితాల్లో మార్పులకు కారణమైతేనే మన జీవితానికి సార్థకత ఉంటుందని తెలిపారు. లక్ష్యాలు ఎంత గొప్పవయినా అవి ప్రజలకు చేరకపోతే.. ఉపయోగం లేదన్నారు. ముందున్న ప్రతి సవాల్‌ను స్వీకరించాలని, సమాజాభివృద్ధి కోసమే ఉండాలన్నారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సింగరేణి సంస్థ మంచి లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని చెప్పారు. ప్రభుత్వం సివిల్స్ అభ్యర్థులకు అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, గండ్ర సత్యనారాయణ, రాజ్‌ఠాకూర్‌సింగ్ మక్కన్, ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్ ఎనర్జీ ప్రిన్స్‌పల్ సెక్రటరీ నవీన్‌మిట్టల్ తదితర అధికారులు పాల్గొన్నారు.

ప్రీప్రైమరీ, పిఎం శ్రీవిద్యను అంగన్‌వాడీల్లోనే నిర్వహించాలి

- ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి : సిఐటియు
- సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్కకు లేఖలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రీప్రైమరీ, పిఎం శ్రీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే నిర్వహించాలనీ, విద్యాబోధన బాధ్యతను అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు ఇవ్వాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) అనుబంధం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.సునీత, పి.జయలక్ష్మి, కోశాధికారి పి.మంగ డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ సీతక్కకు మెయిల్, వాట్సాప్ ద్వారా లేఖలు పంపారు. విద్యా వలంటీర్లకు నిర్ణయించిన వేతనాన్ని అంగన్‌వాడీలకు అదనంగా ఇవ్వాలని కోరారు. ఆరేండ్ల లోపు పిల్లలకు ప్రయివేటు స్కూళ్లను నడపడానికి అనుమతి ఇవ్వకూడదని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. ఐసిడిఎస్‌కు సంబంధంలేని బిఎల్ఓ తదితర అదనపు పనులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 1975లో ప్రారంభమైన ఐసిడిఎస్ దేశ, అంతర్జాతీయ స్థాయిలో మన్ననలు పొందిందని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఐఎల్‌సితో పాటు కాగ్, యునిసెఫ్ తదితర సంస్థలు సిఫారసు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. 2022లో సుప్రీంకోర్టు అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ చెల్లించాలనీ, 2024లో గుజరాత్ హైకోర్టు వారిని పర్మినెంట్ చేయాలని ఆదేశాలు జారీ చేసిన విషయాన్ని ప్రస్తావించారు. 1995 నుంచి అంగన్‌వాడీ కేంద్రాలను పౌష్టికాహారంతో పాటు విద్యను అందించే ఇసిసిఇ కేంద్రాలు(ఎర్లీ చైల్డ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్)గా మార్చాలని అంగన్‌వాడీలు అడుగుతున్నారనీ, దానికి ఆటంకంగా ఉన్న బిఎల్ఓ, ఐసిడిఎస్‌కు సంబంధం లేని అదనపు పనులు రద్దు చేయాలని కోరుతున్నారని తెలిపారు. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకోకుండా ఐసిడిఎస్‌లను నిర్వీర్యం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవడం తగదని సూచించారు. ఇంటర్మీడియట్‌తో పాటు ఆపై చదువులు చదివిన అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లను పరిగణనలోకి తీసుకోకుండా కొత్త విద్యావాలంటీర్లను నియమిస్తామనటం సబబు కాదని ేఆరు సంవత్సరాల లోపు పిల్లలకు ప్రయివేటు స్కూళ్ల నడపడానికి అనుమతి ఇవ్వకూడదని కోరారు. రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేయాలని కోరారు.

విధులు బహిష్కరించిన 'హైడ్రా' మార్షల్స్

- చర్చలు జరిపిన హైడ్రా కమిషనర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నగరంలో విపత్తు నిర్వహణ, ఆస్తుల పరిరక్షణకు పనిచేస్తున్న హైడ్రా మార్షల్స్ జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలిపారు. తమకు గతంలో ఇచ్చిన వేతనాల్లో కోత విధిస్తున్నట్టు ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం జిఓ విడుదల చేయడం కారణంగానే తాము విధులను బహిష్కరిస్తున్నట్టు హైడ్రా మార్షల్స్ తెలిపారు. మార్షల్స్ విధుల్లో చాలా వరకు మాజీ సైనిక ఉద్యోగులు సేవలందిస్తున్నారు. అయితే విధులను బహిష్కరించిన మార్షల్స్‌తో హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్ చర్చలు జరిపారు. పాత వేతనాలే ఇస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ క్రమంలో కంట్రోల్ రూమ్ మార్షల్స్ యధావిధిగా విధులకు హాజరయ్యారు. కాగా, హైడ్రా ఉద్యోగులకు రూ.7000 వేతనం తగ్గిస్తూ ఇటీవల ప్రభుత్వం జీవో విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ విషయమై సంబంధిత శాఖ ఉన్నతాధికారులతో హైడ్రా కమిషనర్ చర్చించారు.

హైడ్రాలో ఎవరివీ వేతనాలు తగ్గవు : హైడ్రా కమిషనర్

హైడ్రాలో పని చేస్తున్న సిబ్బంది వేతనాలు ఎవరివీ తగ్గవని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొని రాత్రీ పగలూ పని చేస్తున్న ఉద్యోగుల వేతనాలు పెంచేందుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం కూడా ఇదే ఆలోచనలో ఉందన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలను రెగ్యులరైజ్ చేస్తూ ఇటీవల ప్రభుత్వం జీవో విడుదల చేయడంతో.. హైడ్రాలో పని చేస్తున్న మార్షల్స్ కొంతమంది అనవసరమైన ఆందోళన చెందారని అన్నారు. సమాచార లోపంతో ఈ జీవో ప్రకారం వేతనాలు తగ్గుతాయేమోనని కొంతమంది ఆందోళన చెందారని, వారితో మాట్లాడి అనుమానాలను నివృత్తి చేశామని, ఎట్టి పరిస్థితుల్లో వేతనాలు తగ్గవని స్పష్టం చేశారు. హైడ్రాలో పని చేస్తున్న మార్షల్స్ ఆందోళన చేస్తున్నారని, విధులకు గైర్హాజర్ అయ్యారని, హైడ్రా కార్యక్రమాలు ఆగిపోయాయని ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో వచ్చిన వార్తల నేపథ్యంలో కమిషనర్ వివరణ ఇచ్చారు. ఎక్కడా ఎలాంటి సేవలకు ఆటంకాలు ఏర్పడలేదని స్పష్టం చేశారు. హైడ్రా అంటే ప్రజల్లో ఎంతో విశ్వాసం, గుర్తింపు ఉందని.. అందుకనుగుణంగా అందరూ కష్టపడి పని చేస్తున్నారని చెప్పారు. సైన్యంలో పని చేసి వచ్చిన వారంతా మార్షల్స్‌గా ఉన్నారని, వారి సేవలపట్ల హైడ్రా పూర్తి విశ్వాసంతో ఉందని తెలిపారు. మిగతా రాష్ట్రాల్లో వారికి ఇక్కడికంటే ఎక్కువ వేతనాలు చెల్లిస్తున్నట్టయితే.. ఆ విధానాలను కూడా అధ్యయనం చేస్తామన్నారు.

విధులు బహిష్కరించిన మార్షల్స్‌తో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్

నోటీసు
మహారాజశ్రీ తెనాలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో
ఈ.ఏ. నెం.502/2024
ఈ.పి.నెం.180/2022 ఇన్ ఓ.యస్.నెం.413/2018
బిట్వీన్ :
Kollapudi Syamu ..... డిహెచ్ఆర్
ఎదిరి
Chilumuru Pradeep Kumar .... జెడిఆర్
To,
Chilumuru Pradeep Kumar, S/o Venkaiah, D.No. 3-95/A, Plot No.18, Road No.3, Sri Sai Nagar Colony, Nagole, Saroor Nagar Mandal, Rangareddy Dist. Telangana State.

పై నెంబరులో డిహెచ్ఆర్ మీపై సదరు కోర్టులో డిక్రీ అమలు నిమిత్తం ఇ.పి. దాఖలు చేసి ఇ.ఎ. 502/2024 పిటీషన్ నుండి మీకు శ్రీ కోర్టు మరియు పోస్టు ద్వారాను నోటీసులు చేయించినను మీరు తీసుకోనందున ఈ ప్రకటన ద్వారా నోటీసు నిమిత్తం శ్రీ కోర్టువారు ఆర్డరు వేస్తూ మీ హాజరు కొరకు ది. 03-09-2025 తేదీకి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, న్యాయవాది ద్వారా గానీ శ్రీ కోర్టువారి యెదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల సదరు ఈ.ఎ. మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)
వాయిదాతేది : 03-09-2025

బొల్లిముంత విజయకుమార్,
దంతాల కిరణ్‌కుమార్,
డిహెచ్ఆర్ తరపు అడ్వకేట్స్,
తెనాలి. సెల్ : 9347653788

హైదరాబాద్‌లో అక్టోబర్ 31 నుంచి కామిక్ కాన్ సీజన్

హైదరాబాద్ : కామిక్ కాన్ ఇండియా 13వ ఎడిషన్ 2025-26 సీజన్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తోన్నారు. అక్టోబర్ 31 నుంచి నవంబర్ 2 వరకు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో జరుగనుందని ఎన్‌ఒడిడబ్ల్యుఎన్ గేమింగ్ కో ఫౌండర్ అక్షత్ రాఠీ తెలిపారు. ఈ మూడు రోజుల ఈవెంట్‌లో ప్రపంచ అతిథులు, కాస్‌ప్లే పోటీలు, గేమింగ్, యానిమే షోకేస్‌లు, లైవ్ మ్యూజిక్, స్టాండ్ అప్ కామెడీ, ఎక్స్‌క్లూజివ్ మర్చండైజ్, ఇంటరాక్టివ్ ఫ్యాన్ జోన్స్ ఉంటాయన్నారు. 2024లో 40,000 మంది పైగా హాజరైన ఈ ఈవెంట్ ఈసారి మరింత ఘనంగా జరగనుందన్నారు.

కీసర ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం

- ముగ్గురు కార్మికులు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని కీసర ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ముగ్గురు పారిశుధ్య కార్మికులు మృతిచెందారు. కీసర పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఔటర్ పై పారిశుధ్య సిబ్బంది పనిచేస్తున్నారు. ఆ సమయంలో ఘట్‌కేసర్ వైపు నుంచి శామీర్‌పేట వైపు వెళ్తున్న టాటా ఇంట్రా వాహనం వారిని ఢీ కొట్టడంతో ముగ్గురు కార్మికులు అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి కారణమైన డ్రైవర్ గణేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతులు ఒడిశాకు చెందిన నారాయణ (28), చెక్మోహన్ (24), జైరామ్ (32)గా గుర్తించారు. గాజువాక నుంచి సెల్‌ఫోన్ టవర్ సామగ్రితో మేడ్చల్ వెళ్తున్న టాటా ఇంట్రా వాహనం డ్రైవర్ మద్యం మత్తులో వాహనం నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్టు పోలీసులు తెలిపారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వికలాంగుని పట్ల అమానవీయ ఘటన

- జగిత్యాల కలెక్టరేట్‌లో ప్రజావాణికి వచ్చిన వ్యక్తిని బయటకు గెంటేసిన సిబ్బంది

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జగిత్యాల కలెక్టరేట్‌లో అమానవీయ ఘటన చోటు చేసుకుంది. ప్రజావాణిలో తన సమస్యను పరిష్కరించాలని కోరుతూ వచ్చిన ఓ వికలాంగుడిని కలెక్టరేట్ సిబ్బంది అవమానించి బయటకు గెంటేశారు. మల్లాపూర్ మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన వికలాంగుడు మర్రిపల్లి రాజగంగారామ్ తన ఇంటి స్థలంలో అక్రమంగా గోడ నిర్మిస్తున్నారని ఫిర్యాదు చేయడానికి వచ్చారు. ఈ సమస్యపై గత వారం కూడా కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేయగా, కలెక్టర్ సత్యప్రసాద్ సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అయితే, అధికారులు సమస్యను పట్టించుకోకపోవడంతో రాజగంగారామ్ సోమవారం మళ్లీ ప్రజావాణికి వచ్చారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఆయన తన వీల్‌చైర్‌లో అదనపు కలెక్టర్ ముందు తన సమస్యను వివరిస్తుండగా కలెక్టరేట్ సిబ్బంది తాగి వచ్చాడని ఆరోపిస్తూ ఆయన్ను వీల్‌చైర్‌తో సహా బయటకు నెట్టేశారు. కలెక్టర్ సత్యప్రసాద్ సమక్షంలోనే ఈ ఘటన జరిగింది. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, రాజగంగారామ్‌కు న్యాయం చేయాలని వికలాంగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు.

టాఫే మాసే డైనాస్టార్ పోటీ విజేతల ఎంపిక

హైదరాబాద్ : ప్రముఖ ట్రాక్టర్ల తయారీ సంస్థ ట్రాక్టర్స్ అండ్ ఫార్మ్ ఎక్విప్‌మెంట్ లిమిటెడ్ (టాఫే) తన మాసే డైనాస్టార్ పోటీ సీజన్ 2 (2025)ని విజయవంతంగా ముగించినట్లు తెలిపింది. గ్రామీణ భారత సాధికరణకు మద్దతునిచ్చేలా దేశ వ్యాప్తంగా 16,000 పైడా ఎంట్రీలను పొందినట్లు పేర్కొంది. ఇది భారత వ్యవసాయ వైవిధ్యాన్ని ప్రతిబింబించేలా పలు రాష్ట్రాల నుంచి 12 మంది ఫైనలిస్టులు ఎంపిక య్యారని తెలిపింది. మొబైల్ స్లర్రీ డీవాటరింగ్ మెషిన్ ఆలోచనతో కర్ణాటకలోని బెల్గాంకు చెందిన అవినాష్ దేశాయ్ గ్రాండ్ రూ.8.2 లక్షల విలువ చేసే ఎంఎఫ్ 254 డైనాస్మార్ట్2 ట్రాక్టర్‌ను గెలుచుకున్నారని ఆ సంస్థ పేర్కొంది.

మోడల్ హౌస్ ప్రకారమే నిర్మాణాలు

- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఆర్థిక భారాన్ని పెంచుకోవద్దు
- హౌసింగ్ కార్పొరేషన్ ఎండి విపి గౌతమ్

సమీక్షలో మాట్లాడుతున్న విపి గౌతమ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగమంతమయ్యేలా చూడాలని హౌసింగ్ కార్పొరేషన్ ఎండి విపి గౌతమ్ అన్నారు. జనగామ జిల్లాలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని, అలాగే క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే సమస్యలను సోమవారం ఎండి పరిశీలించారు. ముందుగా నిడిగొండ గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఇళ్లను ఎప్పుడు ప్రారంభించారు, ఇసుక, మొరం తదితర విషయాల్లో ఏమైన సమస్యలు ఎదురవుతున్నాయా అని ఆరా తీశారు. లబ్ధిదారులకు ఆర్థిక భారం తగ్గాలంటే, నిబంధనల ప్రకారమే ఇళ్ల నిర్మాణాలు జరగాలని సూచించారు. ఇందిరమ్మ మోడల్ హౌస్ ప్రకారమే ఇళ్ల నిర్మాణాలు జరిగేలా అధికారులు చూడాలని, తద్వారా లబ్ధిదారులకు ఆర్థిక భారం తగ్గుతుందని అన్నారు. అనంతరం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫిరెన్స్ హాల్‌లో కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్‌తో కలిసి ఎంపిడిఒ, హౌసింగ్ ఏఈతో కలిసి ఇందిరమ్మ ఇండ్ల పురోగతి పైన, క్షేత్ర స్థాయిలో సమస్యలేమైనా ఉన్నాయా అని ఎండి విపి గౌతమ్ సమీక్ష చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 5745 ఇండ్లు మంజూరు కాగా.. 4560 ఇళ్లు గ్రౌండింగ్ అయ్యాయని, 1999 బెస్మెంట్ లెవల్, 274 రూఫ్ లెవల్, 166 స్లాబ్ లెవల్ వరకు నిర్మాణం అయ్యాయని తెలిపారు. ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో సందర్శన చేస్తూ ఇసుక, కంకర తదితర మెటీరియల్ విషయంలో లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎండీ వీపీ గౌతమ్ మాట్లాడుతూ.. హౌసింగ్ అధికారులు తహసీల్దార్, ఎంపిడిఒతో సమన్వయం చేసుకుంటూ ఉచితంగా ఇసుక టోకెన్లు అందిస్తూ పురోగతిని సమీక్షించాలన్నారు. కంకర, ఐరన్, సిమెంటు, ఇటుకలు ఇతర సామగ్రి నిర్ణిత ధరలకే అందించేలా మండల స్థాయి ధరల నియంత్రణ కమిటీ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. మేస్త్రీలు కూడా నిర్ధారిత రుసుమును మాత్రమే తీసుకునేలా చూడాలన్నారు. క్షేత్రస్థాయిలో తలెత్తుతున్న సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. లబ్దిదారుల ఆధార్ నెంబర్‌కు లింకయిన బ్యాంక్ ఖాతాలోకి దశల వారీగా బిల్లు మొత్తం జమవుతుందని తెలిపారు. సిబ్బంది కొరత సమస్యను ఎండి దృష్టికి తీసుకెళ్లగా ప్రతి 500 ఇండ్లకి ఒక ఎఇ ఉండేలా త్వరలోనే కేటాయిస్తామని అన్నారు. కలెక్టరేట్‌కు వచ్చిన ఎండి ముందుగా ప్రవేశంలో ఉన్న ఫోటో గ్యాలరీని సందర్శించి జిల్లాకు సంబందించిన అన్ని రకాల సమాచారాన్ని ఫోటోల రూపంలో చక్కగా పెట్టారని అభినందించారు. ఈ సమావేశంలో హౌసింగ్ పిడి మాత్య నాయక్, అన్ని మండలాల ఎంపిడిఒలు,. ఎఇలు పాల్గొన్నారు.

ఎస్‌బిఐ ట్రైనీ ఆఫీసర్ల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - హైదరాబాద్

గచ్చిబౌలిలోని స్టేట్ బ్యాంక్ గ్రామీణాభివృద్ధి సంస్థలో 1985 బ్యాచ్ ట్రైనీ ఆఫీసర్లు వేడుకగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. 70 ఏళ్లు పైబడిన 33 మంది తమ జీవిత భాగస్వాములతో కలిసి అప్యాయంగా పలుకరించుకుని.. మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో శివాజీ, అమీర్జాన్, వామనరావు, టిఆర్‌వి సత్యనారాయణ, కొండయ్య తదితరులు నిర్వహణ బాధ్యతలు తీసుకున్నారు.

రెండేళ్లలో పది లక్షల కార్బన్ క్రెడిట్స్ లక్ష్యం

టెక్ స్టార్టప్ సో అండ్ రీప్

హైదరాబాద్ : నగరానికి చెందిన క్లైమేట్ టెక్ స్టార్టప్ సో అండ్ రీప్ అగ్రో ఇటీవల కోషర్ క్లైమట్‌తో కలిసి ఎడబ్ల్యుడి పద్ధతితో వారీ ప్రాజెక్ట్ ద్వారా 37,405 గోల్డ్ స్టాండర్డ్ కార్బన్ క్రెడిట్స్ సాధించినట్లు పేర్కొంది. దీంతో వరి సాగులో తొలి భారతీయ సంస్థగా చరిత్ర సృష్టించినట్లు తెలిపింది. తెలంగాణలోని 35,000 పైగా రైతులతో లక్ష ఎకరాలలో ఈ ప్రాజెక్ట్‌ను అమలు చేశామని.. రాబోయే రెండేళ్లలో గ్రీన్ హౌజ్ ఉద్గారాలను తగ్గించే.. 10 లక్షల కార్బన్ క్రెడిట్స్ లక్ష్యంగా పెట్టుకున్నామని సో అండ్ రీప్ సిఇఒ సూరజ్ తేజా తెలిపారు ఈ విజయం రైతులు, భాగస్వాముల సమిష్టి కృషి అన్నారు.

బంజారాహిల్స్‌లో ఎఐఎన్‌యు కొత్త హాస్పిటల్ ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రముఖ ప్రయివేటు వైద్య సేవల సంస్థ ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఎఐఎన్‌యు) హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో నూతన హాస్పిటల్‌ను ప్రారంభించింది. 150 పడకలు, నాలుగు ఆపరేషన్ థియేటర్లు, 34 డయాలసిస్ బెడ్లు, రోబోటిక్ టెక్నాలజీతో కూడిన అత్యాధునిక ఆస్పత్రిని ఏర్పాటు చేసింది. సోమవారం లాంచనంగా ప్రారంభించిన ఈ హాస్పిటల్ యూరో-నెఫ్రో చికిత్సలలో దేశంలోనే అతిపెద్ద సింగిల్ స్పెషాలిటీ ఆస్పత్రిగా నిలువనుందని యాజమాన్యం తెలిపింది. "రోబోటిక్ సర్జరీ, ఎఐ వాడకంతో యూరాలజీ చికిత్సలలో కచ్చితత్వం, సమర్థత పెరిగింది," అని ఎఐఎన్‌యు ఛైర్మన్ డాక్టర్ సి మల్లికార్జున అన్నారు. "యూరో నెఫ్రో సబ్ స్పెషాలిటీలపై దృష్టితో, ఉచిత స్క్రీనింగ్ శిబిరాల ద్వారా వ్యాధులను నిరోధిస్తున్నాము." అని ఎఐఎన్‌యు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ పిసి రెడ్డి పేర్కొన్నారు."ఎఐఎన్‌యు ద్వారా దేశంలో అతిపెద్ద యూరో-నెఫ్రో నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేస్తున్నాము." అని ఏషియా హెల్త్‌కేర్ హోల్డింగ్స్ ఛైర్మన్ విశాల్ బాలి తెలిపారు.

మత్తు పదార్థాలకు బానిసవుతున్న యువత

- గంజాయి, డ్రగ్స్‌ను నిర్మూలించే బాధ్యత ప్రభుత్వాలదే
- మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య

బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న నరసయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు యువత బానిసలవుతున్నారని, ఇవి వారి శారీరక, మానసిక, ఆరోగ్యాన్ని నిర్వీర్యం చేస్తాయని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య తెలిపారు. వీటిని శాశ్వతంగా సమాజం నుంచి నిర్మూలించడమే పరిష్కారమని, ఆ బాధ్యత ప్రభుత్వాలదేనని స్పష్టంచేశారు.

డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్త ప్రచారంలో భాగంగా సోమవారం హైదరాబాద్ విద్యానగర్‌లోని ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) రాష్ట్ర కార్యాలయం మార్క్స్ భవన్ నుంచి ఆర్‌టిసి క్రాస్ రోడ్స్ వరకు బైక్ ర్యాలీ చేశారు. ఈ ర్యాలీకి గుమ్మడి నరసయ్య జెండా ఊపి ప్రారంభించారు. విద్యానగర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ రామ్‌నగర్ గుండు, వీఎస్టీ మీదుగా ఆర్టీసీ క్రాస్ రోడ్స్ వరకు కొనసాగింది అనంతరం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో గంజాయి, డ్రగ్స్‌ల దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా పీవైఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రవికుమార్ మాట్లాడుతూ.. యువత గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండటమే కాకుండా చుట్టూ ఉన్న ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష, కార్యదర్శులు వీఎస్ కృష్ణ, కొల్లూరు భీమేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మత్తు పదార్థాల పట్ల స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని, గంజాయి డ్రగ్స్ మాఫియాలపై కఠిన శిక్షలను విధించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ గ్రేటర్ హైదరాబాద్ సహాయ కార్యదర్శి కుంభోజి కిరణ్, ఉపాధ్యక్షులు బంగారి శ్రీనివాస్, సహాయ కార్యదర్శి బాలు, కొల్లూరు శంకర్, వి సురేష్, కె నరేందర్, జి అంజి, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేడుకగా మహేష్ బ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి - హైదరాబాద్

ఎపి మహేష్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ 48వ వ్యవస్థాపన దినోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. సోమవారం హైదరాబాద్‌లోని బంజారా హిల్స్‌లోని ఆ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు నియమించిన అధికారి రామ్ నారాయణ బోగ, బ్యాంక్ ఛైర్మన్ రమేష్ కుమార్ బంగ్, వైస్ ఛైర్మన్ లక్ష్మీ నారాయణ్ రాఠీ, బోర్డు డైరెక్టర్లు, సీఈఓ వి అరవింద్, మాజీ డైరెక్టర్లు, కస్టమర్లు, ఎగ్జిక్యూటివ్‌లు మరియు బ్యాంక్ ఉద్యోగులు పాల్గొన్నారు. తమ బ్యాంక్ 2020-21లో గరిష్ఠంగా రూ.4500 కోట్ల వ్యాపార స్థాయిని సాధించినట్లు ఆ సంస్థ ఎండి, సిఇఒ అరవింద్ గుర్తు చేశారు. బ్యాంక్‌కు నిరంతర మద్దతు అందించిన కస్టమర్లు, షేర్‌హోల్డర్లు, శ్రేయోభిలాషులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

వికలాంగులపై దాష్టీకమా?

- పోలీసులతోపాటు కలెక్టర్‌పై కూడా కేసు నమోదు చేయాలి
- ఎన్‌పిఆర్‌డి డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమస్యలు చెప్పడానికి వచ్చిన వికలాంగుడిని ఈడ్చుకెళ్లిన పోలీసులతో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరించిన కలెక్టర్‌పై కూడా కేసు నమోదు చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె వెంకట్, ప్రధాన కార్యదర్శి ఎం అడివయ్య, గౌరవాధ్యక్షులు వరమ్మ, కోశాధికారి ఆర్ వెంకటేశ్ ఒక ప్రకటన విడుదల చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో ప్రజావాణిలో వికలాంగుల సమస్యలు తెలిపేందుకు వచ్చిన వికలాంగుడి దాష్టీకాన్ని ప్రదర్శించిన వారిపై 2016 వికలాంగుల హక్కుల చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. మల్లాపూర్ మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన వికలాంగుడైన రాజ గంగారాం ఇంటి సమస్య కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోలేదని పేర్కొన్నారు. సమస్యలు తెలుసుకుని పరిష్కారం చేయాల్సిన కలెక్టర్ వికలాంగుడైన గంగారాంను చూసీ, చూడనట్టు వ్యవహరించడం తగదని హితవు పలికారు. జిల్లా కలెక్టర్ వస్తున్నాడని చెబుతూ వికలాంగుణ్ణి ఈడ్చుకువెళ్లే హక్కు పోలీసులకు ఎక్కడిదని ప్రశ్నించారు. ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకువాలని డిమాండ్ చేశారు.

కమిషనర్‌కు లేఖ

ఇదే అంశంపై వికలాంగుల సంక్షేమ శాఖ కమిషనర్ బి శైలజకు ఎన్‌పీఆర్‌డీ వాట్సాప్ ద్వారా ఆ సంఘం వినతి పత్రాన్ని పంపింది. వికలాంగుడిని ఈడ్చుకెళ్లిన పోలీసులు, నిర్లక్ష్యంగా వ్యవహరించిన కలెక్టర్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేసింది. ఈ అంశంపై విచారణ చేపట్టాలని కోరింది.

ర్యాలీ చేస్తున్న వైద్యులు

వైద్యులపై హింసను అరికట్టాలి

- ఐఎంఎ శంషాబాద్ శాఖ డిమాండ్
- లిమ్స్ హాస్పిటల్‌పై దాడికి నిరసనగా వైద్యుల ర్యాలీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వైద్యులపై జరుగుతున్న హింస, దాడులను ప్రభుత్వం వెంటనే అరికట్టాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ శంషాబాద్ శాఖ ప్రభుత్వాన్ని కోరింది. ఈనెల 8వ తేదీ రాత్రి రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లోని లిమ్స్ హాస్పిటల్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ సోమవారం ఐఎంఎ శంషాబాద్ శాఖ ఆధ్వర్యంలో వైద్యులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ లిమ్స్ హాస్పిటల్ నుంచి బస్‌స్టేషన్, రాల్లగూడ రోడ్, ఆర్‌జీఐఎ పోలీస్ స్టేషన్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు సాగింది. శంషాబాద్‌లోని వివిధ ప్రయివేటు ఆస్పత్రుల యాజమాన్యాలు, వైద్యులు, సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సేవ్ డాక్టర్స్ సేవ్ సొసైటీ, 'వయలెన్స్ అగైనెస్ట్ డాక్టర్స్' అంటూ పెద్ద నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా లిమ్స్ ఆస్పత్రిపై జరిగిన దాడిని వైద్యులంతా ముక్తకంఠంతో ఖండించారు. దాడికి పాల్పడిన వారిపై, దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలు సైతం వైద్య సేవల విషయంలో వైద్యులకు సహకారించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు డాక్టర్లు మాట్లాడుతూ.. ఆస్పత్రులపై భౌతికదాడులు చేయడం సరికాదన్నారు. దాడులకు పాల్పడితే ప్రాణాపాయ స్థితిలో ఉన్న పేషెంట్లను చేర్చుకొని, వారికి వైద్య సేవలు అందించడం పట్ల ఆలోచించాల్సి వస్తుందని తెలిపారు. లిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న మహిళ మృతి విషయంలో వారి బంధువులు వెనుకా ముందు ఆలోచించకుండా హాస్పిటల్‌పై, వైద్యులు, సిబ్బందిపై తీవ్రంగా దాడి చేశారని ఆరోపించారు. ఈ దాడితో ఐసియులో ఉన్న పేషెంట్స్ సైతం భయభ్రాంతులకు గురయ్యారని అన్నారు. ఇలాంటి ఘటనలు సమాజానికి మంచిది కాదన్నారు. ఇలాంటి దాడులను తీవ్రంగా ఖండించారు. మళ్లీ పునరావృతం కాకుండా చూడాలన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు తాము ఎప్పుడూ ముందుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లిమ్స్ హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ రామరాజు, డాక్టర్లు ప్రేమ్‌రాజ్, అమరేందర్, సత్యంయాదవ్, రామకృష్ణారెడ్డి, శంకర్, చంద్రకాంత్, ఉషారెడ్డి, రాజేందర్, శేఖర్, జాకీర్ పాల్గొన్నారు.

ఇజివిఎఫ్‌కు ఎస్‌బిఐ భారీ సాయం

- రూ.50 లక్షల పరికరాలను ఇచ్చిన ఛైర్మన్

ప్రజాశక్తి - హైదరాబాద్

సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించే ఎన్‌జిఒ ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ (ఇజివిఎఫ్)కు దేశంలోనే అతిపెద్ద విత్త సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు సెట్టి భారీ సాయాన్ని అందించారు. సోమవారం కోటిలోని లోకల్ హెడ్ ఆఫీసులో జరిగిన కార్పొరేట్ సామాజిక కార్యక్రమం (సిఎస్‌ఆర్)లో భాగంగా ఇజివిఎఫ్‌కు రూ.50 లక్షల విలువైన కంప్యూటర్, సైన్స్ ల్యాబ్ తదితర విద్యా పరికరాలను విరాళంగా ఇచ్చారు. గ్రామీణ విద్య, సేంద్రీయ వ్యవసాయం, సాధికారతను ప్రోత్సహించే ఇజివిఎఫ్‌కు రెండు ఇ-వాహనాలను కూడా అందజేశారు. అదే విధంగా మెదక్, వికారాబాద్ స్వయం సహాయక బృందాలకు ఎస్‌బిఐ లేడిస్ క్లబ్ ప్రెసిడెంట్ శ్రీదేవి సూర్య నిత్యావసరాలు, కుట్టు మిషన్లు విరాళంగా ఇచ్చారు. కార్పొరేట్ బ్యాంక్‌లు తమ నికర లాభాల నుంచి ఒక్క శాతం నిధులను సిఎస్‌ఆర్‌కు కేటాయించాలన్న ఆర్‌బిఐ మార్గదర్శకాలకు ముందు నుంచే ఎస్‌బిఐ సామాజిక కార్యక్రమాలకు సాయాన్ని అందిస్తుందని శ్రీనివాసులు సెట్టి గుర్తు చేశారు.

పోలీస్ స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న 'మధ్యాహ్న భోజన' కార్మికులు

మధ్యాహ్న భోజన పథకం 'అక్షయ పాత్ర'కు ఇవ్వొద్దు

- సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి
- హనుమకొండలో మంత్రి కొండా సురేఖ ఇల్లు ముట్టడి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయ పాత్రకు ఇవ్వొద్దని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయ పాత్రకు అప్పగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలను వ్యతిరేకిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండ జిల్లా రాంనగర్‌లోని మంత్రి కొండా సురేఖ ఇంటిని ముట్టడించారు. మంత్రి బయటికి రావాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. గంటపాటు మంత్రి ఇంటి ఎదుట ధర్నా చేసిన కార్మికులు.. మంత్రి ఇంటి లోపలికి వెళ్లడానికి ప్రయత్నించారు. దాంతో పోలీసులు, కార్మికులకు మధ్య పెద్ద ఎత్తున తోపులాట జరిగింది. ముట్టడి చేస్తున్న సీఐటీయూ నాయకులను పోలీసులు అరెస్టు చేసి సుబేదారి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి, జిల్లా కార్యదర్శి అరూరి కుమార్, నాయకులు వాణి, ప్రభాకర్, ఉపేందర్‌లతో పాటు 50మందికి పైగా మధ్యాహ్న భోజన కార్మికులు ఉన్నారు. ఈ అరెస్టులను సిఐటియు హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ తీవ్రంగా ఖండించారు. అరెస్టు చేసిన వారిని తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సుబేదారి పోలీసులు మధ్యాహ్నం మూడు గంటలకు సీఐటీయూ నాయకులను సొంత పూచీకత్తు మీద విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి రాష్ట్ర మాధవి మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రయివేట్ సంస్థలకు అప్పగించడం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో 25 ఏండ్ల నుంచి పనిచేస్తున్న కార్మికులు ఉపాధి కోల్పోతారని అన్నారు. మధ్యాహ్న భోజన పథకం అనేది పిల్లల హక్కు అని, ప్రభుత్వమే దీన్ని నిర్వహించాలని డిమాండ్ చేశారు. పథకం ప్రభుత్వ పర్యవేక్షణలో కాకుండా ప్రయివేట్ సంస్థల ద్వారా నిర్వహించబడితే, భోజనం నాణ్యత, పారదర్శకత విషయంలో సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్రకు అప్పజెప్పే చర్యలను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

మీడియాతో మాట్లాడుతున్న గంగుల కమలాకర్

బిసి రిజర్వేషన్ కోసం బిఆర్‌ఎస్ 'కదన భేరి'

- ఈ నెల 14న కరీంనగర్‌లో సభ.. హాజరుకానున్న కెటిఆర్
- కాంగ్రెస్ బూటకపు హామీలు : తలసాని శ్రీనివాస్
- బిసిలకు అవకాశాలిచ్చింది కెసిఆరే : గంగుల కమలాకర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బిఆర్‌ఎస్ పార్టీ ఈనెల 14న కరీంనగర్‌లో 'బిసి కదన భేరి' పేరిట భారీ బహిరంగ సభను నిర్వహించనుంది. ఈ సభకు బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. సభకు సంబంధించిన సన్నాహక సమావేశం సోమవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బిఆర్‌ఎస్ నేతలు మీడియాతో మాట్లాడారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. తాము అధికారంలోకి వస్తే బిసిలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని, ఏటా రూ.20 వేల కోట్లు కేటాయిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిందని తెలిపారు. ఇప్పుడు కేవలం ఓ తీర్మానం చేసి చేతులు దులుపుకుందని విమర్శించారు. కుల గణన, 42 శాతం రిజర్వేషన్ల అంశాలపై లోక్‌సభ ఎన్నికలకు ముందు హడావిడి చేసి ఇప్పుడు ఏమీ చేయడం లేదని ఆరోపించారు. సిఎం రేవంత్‌రెడ్డి బిసిల పట్ల చులకనగా మాట్లాడుతున్నారని విమర్శించారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం బిసిలకు గురుకులాలు ఏర్పాటు చేసి, కులవృత్తులకు వేల కోట్లు ఖర్చు చేసిందని గుర్తుచేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహించొద్దని డిమాండ్ చేశారు. అనంతరం కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేతలు ఢిల్లీలో ప్రధానిని, రాష్ట్రపతిని కలిసేందుకు ప్రయత్నించారా అని ప్రశ్నించారు. వంద మంది ఎంపీలు ఉన్న కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్‌లో ఈ అంశంపై ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. 'బిసిలకు ఆత్మగౌరవ భవనాలు నిర్మించింది, ఆర్‌టిసి చైర్మన్‌గా, హైదరాబాద్ మేయర్‌గా బిసిలకు అవకాశం ఇచ్చింది కేసీఆర్' అని తెలిపారు. మంత్రులుగా కూడా బిసిలకు ఎక్కువ అవకాశాలు ఇచ్చింది గత ప్రభుత్వమే అని చెప్పారు. తదనంతరం శాసన మండలి పక్ష నేత మధుసూదనచారి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సహా పలువురు నేతలు మాట్లాడారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు బండ ప్రకాష్, ఎల్.రమణ, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, బీసీ కమిషన్ మాజీ చైర్మెన్ వకుళాభరణం కృష్ణమోహన్, జడ్‌పి మాజీ చైర్‌పర్సన్లు తుల ఉమ, కనుమల్ల విజయ, ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, ఒడితెల సతీష్‌బాబు, విద్యాసాగర్‌రావు, కోరుకంటి చందర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.